# మరమరాలు

"మల్లి ఎల్లిపోయింది" అంటూ పేపర్ చదువుతూ కూర్చున్న రాములు ముందుకొచ్చి నిలుచున్నాడు సోమయ్య. నోటమాట రాక సోమయ్య వైపు చూస్తుండి పోయాడు రాములు.

"పేదోళ్ళకు రోగాలు పుట్టిగనే వొస్తయి గాని పుట్టిగనే పోవు. పానాన్ని తీసుకునే పోతయి" అంటున్నప్పుడు సోమయ్య కనుకొలకులు తడి అయినయి.

"దావకానాకు తీసుకు పోలేదా ?" పేపరును మడిచి ప్రక్కన పెడుతూ అడిగాడు.

"తీస్కపోతే ఏముంది, అక్కడ పైసలు లేంది మొకం జూస్తరా? పోతందుకు బాట కర్సులు లేవాయె, యిక్కన్నే ఆడాడా అడుక్కొచ్చి సూదులు యిప్పిస్తే తగ్గదాయె"

"మొగనికి చెప్పంపలేదా?"

"ఆడేమొస్తడు, పొద్దంత చేసి రాత్రంత తాగుతడట. ఆనికి పెండ్లం వుందన్న జాసే లేనట్టుంది. యిగ సావుకా ఆడు అందడు. రాత్రి సచ్చిన మనిషి అప్పుడే ఆసన లేసింది. దాని అక్క దగ్గర్కి తెల్లొరగట్ల మనిషిని పంపినం ఆల్లు రాంగనే."

"సరే" అంటూ లేచి నిలుచున్నాడు రాములు. మల్లి యిక కనపడదు అని గుర్తొచ్చే సరికి ఎదలో ఏదో బాధ సుడిగాలిలా కదిలి కనురెప్పల మధ్యన కన్నీటి తెరలను పరిచింది.

"యింట్ల సిల్లిగవ్వ లేదు, అత్త ముసిల్ది ఏడుస్తూ కూసుంది. దాంతోటే తలగోరు పెట్టియ్యాలె. వున్నొక్కపిల్ల చిన్న పిల్ల. సరె ఎవరో ఒకరు పెడ్తరు గాని సావు కర్సు నీవు పెట్టుకో" అన్నప్పుడు రాములు ఏం మాట్లాడ లేక సోమయ్యనే చూస్తున్నాడు.

పక్క జిల్లాలో పంతులు పనిచేస్తున్న రాములు చాలా రోజుల తర్వాత తన ఊరొచ్చాడు. రెండు రోజుల తర్వాత

తన భార్య పిల్లలూ వస్తారు. అందరూ కలిసి ఓ వారం రోజులు గడిపి వెళ్ళాలని ఆయన ఉద్దేశం. చావు ఖర్చులు పెట్టే స్తోమత వున్నా తానే ఎందుకు పెట్టాలో, సోమయ్య తననే ఎందుకు అడుగుతున్నాడోఅర్థం కాలేదు.

"నేను అన్నీ ఆలోచించే సెపుతున్న. రావలసినోనివి పిలిచినట్టే వొచ్చినవు. సావుకర్సు నీవు పెట్టుకోవల్సిందే. నీవె ఎందుకు పెట్టుకోవాల్నో నీకెరక నాకెరుక, అదైతే లేదుగదా ?" అంటు రాములు కళ్ళలో చూశాడు.

"నీవెందు కంటున్నావో నాకర్థం కావటం లేదు!" నేలను చూస్తు అన్నాడు.

"నేను అర్థముండ బట్టికనే సెప్పిన. నేను పోయి పాడె కట్టిస్తుంటా రా" అంటూ సోమయ్య అక్కడి నుండి కదిలాడు, తప్పదు అన్నట్లు చూస్తూ. నలభై ఐదేళ్ళ సోమయ్యకు పేదరికం పెట్టిన బాధల వల్ల బక్కచిక్కిన కాళ్ళకు చేతులకు నరాలు దేలినా సత్తువ తోటే నడుస్తున్నాడు.

రాములు ఆలోచనల్లో చిక్కుకుని సోమయ్య వెళ్ళిన వైపేచూస్తున్నాడు. కొంత సేపటికి సోమయ్య కనపడకుండా పోయి మల్లి కళ్ళముందు కొచ్చింది.

"తాను బియిడి ముగించుకుని శెలవుల్లో

ఊరొచ్చినప్పుడు ఆమె ఈ ఊరికి కోడలుగా వచ్చింది. తన యిల్లున్న వాడలోనే ఆమె ఇల్లు కూడా. రోజూ పొద్దున్నే నీళ్ళుతోడు కోవడానికి తన యింటి ముందున్న బావి మీదికి వస్తూ వుండేది. కాయ కష్టం చేయడం వల్ల శరీర అవయవాలు పడుచుదనం పరువంలో సమపాళ్ళల్లో ఎదిగి కళ్ళల్లో ఆకర్షణ, చూపుల్లో చురుకుదనం తొణికిసలాడేది. ఆమెను చూసిన వాళ్ళల్లో ఏవేవో తలంపులని వాళ్ళ వాళ్ళ చూపులే చేప్పేవి. సీ అండ్ ఎంజాయ్ అనే కాలేజీ స్లోగన్ మాటి మాటికీ గుర్తొచ్చి తనకు నవ్వొస్తూ వుండేది. అందమున్న వైపు ఆకర్షించ బడడం కళ్ళకున్న సహజ గుణమైతే, మంచి చెడులను ఆలోచించేది మనస్సు లక్షణం కదా. మగనాలి, చూసి వూర్కోవడం తప్ప మరో ఆలోచనకు దారి వుండ కూడదు కదా.

పట్టణాల్లోని కళాశాలల్లో అమ్మాయిలంతా అందంగా అలంకరించుకొని నాజూగ్గా తిరుగుతూ వుంటే కొంటె చూపులు తుంటరి మాటలు విసురుకోవడం జరుగుతూ వుంటాయి. కాని పల్లెల్లో అలా కాదు. మాటకు మాట, నడిచినా నిలుచున్నా ఓమాదిరి స్థిరత్వం. మనస్సును కదిలించే సరసం మట్టెల చప్పుళ్ళతో, గాజుల సందడితో

మలినం లేని నవ్వులతో తిరుగుతారని రెండు రకాల జీవితాలను పరిశీలించినాక తెలిసొచ్చిన నిజాలు. తిరునాళ్ళలో తిరగడం, పండుగల్లో సంబర పడడం, పెళ్ళిళ్ళలో ఒక ఊరి నుండి మరో ఊరికి వెళ్లడం లాంటివి మనుషులను దగ్గరకు చేరుస్తాయని, వరుసలతో పిలుచుకునే మాయ మర్మం లేని మాటలు ఎంతో ఆనంద పరుస్తాయని అనుభవ పూర్వకంగా తెలిసొచ్చింది.

మల్లి పరిచయం తనను మరింత ఉల్లాస పరిచింది. ఆమె చూసినా నవ్వినా మాట్లాడినా మనస్సు విప్పుకొనేది.

అప్పుడప్పుడు చేద బావి దగ్గరో, చెర్వు కట్ట మీదనో కలిసినపుడు, మౌనంగా నవ్వుకోవడం ఊర్లో కొందరికి, ముఖ్యంగా ఆమె అత్తగారి వాళ్ళకు అనుమానం వచ్చింది. అది పెరిగి అనర్థపు ఆలోచనగా మారి ఈ అక్రమ సంబంధం ఆగిపోవాలంటే యిద్దరిలో ఒకరు అయిపోవల్సిందే అన్న నిర్ణయానికొచ్చి ఆమె మరుదులు, బావలు కాపలా కాశారు. అనుకున్న స్థలానికి అనుకున్న వాళ్ళు రావడం లేదని మల్లిని చంపితే, రెక్కాడితే కాని డొక్కాడని మల్లి సంసారం ఉన్నా లేకున్నా భార్య భర్తల రోజు కూలితో దినం గడిచేది. మళ్ళీ పెళ్ళి ఓ సమస్య కనుక మందలించి వూర్కున్నారు. మరిగిన జీవి తప్పక

చిక్కుతుందని, హత్య చేయాలన్న ఆలోచనలను వాయిదా వేసుకుంటూ వచ్చారు.

**

డప్పుల చప్పుడు చావును చాటుతున్నాయి. రాములు మనస్సు అదో మాదిరిగా వుంది. ఏదో తప్పు చేసిన వాడిలా అటూ ఇటూ తిరుగుతున్నాడు. మల్లి చచ్చిపోయిందీ. ఆ నవ్వూ, ఆ నడకా, ఆ చూపులు వయస్సుతో పాటు పెరుగుతూ సంతరించుకున్న సహజమైన అందం-చందం ఎక్కడికి పోతుంది? కాకపోతే పేదరికం వల్ల కొంత తగ్గినట్లు కనిపించవచ్చు. చచ్చినాక మల్లి ఎలా వుంటుందో వూహించలేక పోయాడు. వెంటనే వెళ్ళి చూడాలని వాళ్ళ యింటి వైపు నడిచాడు. డప్పుల చప్పుడు ఎక్కువైంది. వాకిలి నిండా జనం నిలుచుని ఏదేదో మాట్లాడుతున్నారు. ఆమె ముదుసలి అత్త ముంత పట్టుకుని ముందు నడుస్తుంది. ఆమె ముడుతలు పడ్డ ముఖంలో కాలం గీసిన బాధల గుర్తులు. దుఃఖాన్ని యింకించుకున్న కళ్ళు పీక్కుపోయినయి. కొడుకును మరిచి పోయిన ఆమె మనస్సు కోడలు కోసం తన్ను కుంటోంది. తన భర్త పోయిన రోజు గుర్తొచ్చినట్టుంది. మధ్య మధ్య నిట్టూర్పులు తన్నుకొస్తున్నయి. పాడెను

పట్టిన వాళ్ళు కదిలారు. పాడె వెంట ముందు వెనుక జనం. ముత్తైదువగా పోయిన మల్లికి పసుపు కుంకుమ పూశారు. కొన్ని బంతిపూలు వేశారు. ముఖం కనిపించేటట్టూ వుంచి నిలువెల్ల తెల్లగుడ్డని కప్పారు. రాములు వడివడిగా నడిచి జనంలో కలిసి పాడె ప్రక్కగా నడుస్తున్నాడు. రాములు రాకను చూసిన కొందరు గుసగుస లాడుకుంటున్నట్లనిపించింది. ఆడవాళ్ళల్లో కొందరు కంట నీరు పెడుతూ ముక్కు చీదుతూ వుంటే మగవాళ్ళు మౌనంగా నడుస్తున్నారు. మరికొందరు మధ్య మధ్యన డప్పు వాళ్ళను ఆపి దరువు వేయిస్తూ, ఆడుతూ వున్నారు. బాగా తాగిన సోమయ్య పాడె వెనకాల నడుస్తూ వొళ్ళోవున్న చిల్లర నాణేలను మరమరాలను శవంపై చల్లుతూ వుంటే కొందరు పిల్లలు ఆ నాణేలను ఏరుకుంటున్నారు. శవయాత్ర చూసేసరికి చెప్పలేని బాధ రాములు వంటిని చుట్టేయగా, వేసే అడుగుల్లో సత్తువ తగ్గింది. అయినా నలుగురితో కలిసి నడుస్తూ రకరకాలుగా ఆలోచిస్తున్నాడు. చావు ఖర్చు యివ్వలేనందుకు మనస్సు చివుక్కుమంది. పైసలను చల్లుతున్న సోమయ్యను చూస్తుంటే రాములికి సిగ్గనిపించింది. వీలైనంతవరకు అతని కంట పడకుండా

నడుస్తున్నాడు. దింపుడు కళ్ళెం దగ్గర శవాన్ని దింపి గాజులు, మట్టెలు తీసేశారు.

ఆ తరువాత శవాన్ని బొందవైపు మోసుకెళ్ళారు. రాములు పొంగివస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ, యిక ఆమెను మట్టిలో పెట్టడం చూడలేనని యింటివైపు నడిచాడు. వొంటరిగా నడుస్తున్న రాములు కళ్ళముందు గతం కదలాడింది.

**

ఒకరోజు యింట్లోవున్న వేప చెట్టు కింద కూర్చొని గడ్డం గీసుకుంటున్నాడు రాములు. పక్కింటి బాలమ్మ బయట దర్వాజ దాటి లోపలికొస్తూ "మీ వదిన మీ అన్నకు బువ్వ కొంచబోయినట్లుంది."

"ఆ"

కొప్పును విప్పుకొని వెంట్రుకల చిక్కును సరిజేసుకుంటూ 'సదువు అయిపోయెగ? యిగ పెండ్లి చేసుకోరాదు?' అంటూ రాములు చేతిలోని అద్దాన్ని తీసుకుని అందులో తన ముఖాన్ని చూసుకుంటు ఓసారి పాపిడను సరిచేసుకుంది.

"నౌకరి రానీ వొదినా" అంటూ షేవింగ్ బాక్సును సర్ది పక్కకు పెట్టాడు.

"నౌకరొచ్చే వరకు నారాయణ జపమేనా?" అంటూ అద్దాన్ని అతని చేతిలో పెట్టింది.

తప్పదు అన్నట్లు చూశాడు అద్దంలో తన ప్రతిబింబం వైపు. "అద్దం మనసును చూపియ్యకున్న వయస్సును సూపిస్తది సుమా" అని ఆమె అన్నప్పుడు, అవును అన్నట్టు తల ఆడించాడు.

"పొర్లిపారే వాగు, పోయే వయస్సు వెనక్కి రావట" అంది మళ్ళీ తానే. రాములు ముసిముసిగ నవ్వుతూ బాలమ్మ వైపు చూశాడు.

"పొలం పనులు తప్ప మీ అన్న నీ గురించి పట్టించుకోడాయె, మీ వదినన్న సెప్పదాయె" అని బాలమ్మ అన్నప్పుడు రాములుకు తల్లి, తండ్రి గుర్తొచ్చారు. ముఖంలో ఏదో కొరత కొట్టొచ్చినట్లు కనిపించింది.

"దాని గురించేనా ఆలోచన?"

"దేని గురించి?" చేతిలోని అద్దాన్ని షేవింగ్ బాక్సు మీదుంచుతూ అడిగాడు.

"అదే రోజు తానానికి నీళ్ళు తోడిపెట్టేది.'

"ఆమె గురించా? అదేం లేదే"

'ఓహోనే కనిపెడ్తనే వున్నలే" అంటు తల వెంట్రుకలను ఒక్క దగ్గర్కి చేర్చి

కొప్పేసుకుంటున్నప్పుడు, చేతులు వెనక్కు వెళ్ళడం వల్ల ఆమె ఎత్తయిన ఎద అతలాకుతలంగా కదిలింది.

నలభై దాటిన బాలమ్మ ఏం చదవక పోయినా మనుషులను వాళ్ళు చేసే మాయల్ని చూసింది. పురాణ కథల్ని వింటూ వాటిల్లో నీతి పేరిట జరిపే తంతులను తెలుసుకుంది. అందుకే ఆమె మాటల్లోనూ చేతల్లోనూ తెగింపు కనిపిస్తుంది.

"అవును పేరుకు తగ్గ మనిషివే కాని వొట్టి చూపులతో మాటలతో మందిని పిచ్చోళ్ళుగా సెయ్యొద్దు సుమా"

రాములు ఏదో చెప్పబోయే సరికి ఆగు అన్నట్లు చేత్తో సైగ చేసి మరింత దగ్గరకు చేరి 'కోరికలు రేగడానికి మాటలు, చూపులు మంత్రాలు పిలగ, నీవంటె అది పడి సస్తది' అని సాగదీస్తూ తన రెండు చేతులను తొడల మధ్య వుంచి శరీరాన్ని వేమాదిరిగా వొంచి వొదులుతూ అంది.

"నేను అట్లేమి కాదు" అంటూ లేచి నిలుచున్నాడు.

"కాకుంటె మానాయె ఊరంత కోడై కూస్తుంది. ఏం చెయ్యకుంట ఎందుకా బదునాం" అతని కళ్ళల్లోకి చూస్తూ అంది.

"దానికి నేనేం చెయ్యను?" తల వంచుకుని అన్నాడు.

"ఏం లేదు నేను దాన్ని పిలుస్తా కలువు - ఆ తరువాత ఒకరిమీద ఒకరికున్న మరులు తగ్గితయి".

"నీతో చెప్పిందా?"

"సెప్పాలా్న సూస్తుంటే తెల్వదా? అయినా ఆడది నోరు తెర్సి అడ్గుతదా?"

"భర్త వున్నాక"

"అయ్యో రామ, ఐదుగురున్నంక ద్రౌపతి ఆరోగని మీద మనస్సు పెట్టిందని యిననే లేదా?" ఒసారి కుడి చేతిని నోరుపై వుంచి తీసింది.

"అవి కథలు"

"వొట్టి కతలు గావు" తలను అడ్డంగా ఆడిస్తూ అంది.

"మరి?" అంటూ ఆమె వైపు ఆసక్తిగా చూశాడు.

"లంజకతలు" అంటూ ఒకన్ను మూసి తెరిచింది.

ఈసారి రాములుకు సవ్వాగలేదు.

"సెంద్రక్కా నీళ్ళబొక్కె నిస్తావా" అంటూ బయటి దర్వాజాను పట్టుకుని ఇంట్లోకి తొంగి చూసింది మల్లి.

"ఇక్కడి నుండి తప్పుకో కాసేపు" అని ఎడమ చేత్తో రాములుకు సైగ చేసి.......

"యిస్తా... రా రా" అంటూ కుడి చేతితో సైగ చేసింది. బాలమ్మ అందరితో కలగలుపుగా మాట్లాడడం వల్ల

అందరూ ఆమెతో సరదగా చనువుగా వుంటారు. ఆమె మొదటి మొగుణ్ణి వొదిలి ఈవూరికి రెండవ మనువు వచ్చింది. ఈమె ఎంత మాటకారో ఆమె మొగుడు అందుకు వ్యతిరేకం. అతను ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. తన పనేదో తాను. అంతేగాదు బాలమ్మను అదుపులో పెట్టే ప్రయత్నం చెయ్యడు. అందుకని బాలమ్మ మాటలు అందర్నీ నవ్విస్తూ వుంటాయి. కవ్విస్తూ వుంటాయి.

సెంద్రక్క వున్నదనుకునొస్తె బాలక్క వుంది. వొంటరిగ కలిస్తె ఏదో ఓకొంటె మాటంటది. ఏమి అనసుందో అనుకుంటూకింది పెదవిని పంటి కింద అదిమి వుంచి, నవ్వు ముఖంతో లోపలికి వచ్చింది మల్లి.

"నవ్వులు నాకాయి, చూపులు ఎవ్వరినో ఎతుకుతున్నాయి". అంటూ మల్లి ముఖాన్ని చేతుల్లో తీసుకుని బుగ్గలను అదిమి వొదిలింది. ఏదో సిగ్గు బుగ్గల మీద ఎరుపై పూసింది.

'వొట్టి చూపులతో ఎన్నాళ్ళు? అంటూ ఆమె చేతులు పట్టుకుని యింటి వెనక వైపు తీసుకెళ్ళి -

"సూడు రాములు నీమీద మనసు పెట్టిండు" అంది.

నేలను కాలి బొటన వ్రేలితో రాస్తూ, ఆ వేలునే చూస్తూ

నిలుచుంది మల్లి.

"పిలుస్తా" భుజం మీద చేయి వేస్తూ.

"వొద్దు" కళ్ళు పెద్దవి చేసి గుండెల మీద చేతులను వేసుకుంటూ అంది.

"ఎందుకొద్దు?" సూటిగా కళ్ళల్లోకి చేస్తూ.

కాని పని అన్నట్లు తల అడ్డంగా ఊపింది.

"అదే"

"మా అక్కా బావా పెంచి పెండ్లి చేసి(ను. అత్తగారింటికి సాగనంపుతూ మా అక్క కంట నీరు పెట్టుకుని మనం దిక్కులేనోళ్ళం. మన మంచే మనకు దిక్కు. కన్నింటికి కొన్నింటికి మంచి పేరు తేవాలి పేదరికంతో చచ్చినా సంతోషిస్తా కాని చెడ్డ పేరు తేవద్దు" అంది.

కంటనీరు నింపుకున్న మల్లిని వొదిలి బాలమ్మ సిగ్గుతో తల వంచుకుని నిలుచుంది. మల్లి చేద బొక్కెనతో బయటికి నడిచింది. రాములు రోజులా చేదబావి మీదికి పోకుండా వూరిపక్కనే వున్న వ్యవసాయ బావి వైపు నడిచాడు.

రాములుకు బాలమ్మ మీద కోపమూ, మల్లి మీద గౌరవమూ పుట్టుకొచ్చాయి.

'బొంద పెట్టిన్రా?' ఎదురొస్తూ అడిగింది బాలమ్మ.

బాలమ్మ వెనకట తనతో మాట్లాడినట్లుగా లేదు. సగం కంటె ఎక్కువగా తల నెరిసింది. మనిషి కూడా దిగిపోయి, వయసుతో పాటు వచ్చిన మార్పు కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

"ఆ"

"బతకమ్మ లాంటి మనిషి మట్టిపాలై పాయె చేసుకున్నోడు సక్కంగ సాదుకుంటె, యింత తొందర సావకపోవు"

రాములు మౌనంగా నిలుచున్నాడు.

"మొగుడు సావు కందడని ఆ సోమయ్యే అదో ఇదో సేసి సావుకర్సు ఆదుకుండటగ".

"అట్లనా?" అన్నట్లు చూశాడు రాములు.

"ఆమాత్రం సెయ్యడా అంటున్రు".

"అంటే" రాములు ఆశ్చర్యంగా.

"ఆడు దానికి అలవాటట" అని గొంతు తగ్గించి అంటూ కొంగును నెత్తి చుట్టూ కప్పుకుంది ఎండ తగలకుండా.

"ఆమె అలాంటిది కాదని మనకు తెలుసు కదా?".

"తిని కుడిచేదాన్ని వొదిలి పోయినా, పైసా పంపకున్నా

నెలల కొద్దీ రాకపోయినా మొగరాయుడొలె కష్టం చేసి అత్తను అడక్క తినకుండా సాదిందనుకో".

"ఆమె తప్పు చేసిందంటే నేను నమ్మను".

"నేనూ నమ్మను కాని లోకులే గుసుగుస".

సోమయ్య చావు ఖర్చు ఎందుకడిగిండో యిప్పుడర్థమయ్యింది. ఒకవేళ తానూ యిస్తే...

"నేనందాక పోయొస్తా" అంటూ ఆమె బొందల వైపు, రాములు యింటి వైపు నడిచారు.

తోవ పొడుగునా సోమయ్య చల్లిన స్వచ్ఛమైన మరమరాలు కాకుల్లాంటి లోకుల కాళ్ళకింద నలిగి మనిషికీ మనిషికీ మధ్యన వున్న సంబంధాలను గూర్చి ప్రశ్నిస్తున్నట్లు అనిపించింది రాములుకు.

1992